# శత్రువు

- కొంపెల్ల లక్ష్మసమీరజ

అబ్బ... చలి... నెత్తురు చల్లబడే చలి! ఈ రాత్రి గడిచాక రేపు ఉదయమే — ఎడార్లూ, నదులూ, అరణ్యాలూ దాటాలి!

ట్రెంచెస్‌లో దిగాలి! పైన ఏరోప్లేన్— చేతిలో స్టెన్‌గన్! కీ ఇస్తే తిరిగే ఆటబొమ్మ సైనికులం!

మార్చ్! వన్— టూ— త్రీ— షూట్!

డెడ్.. ఎవడే? నువ్వా —నేనా? కేబుల్ గ్రామ్ ఇప్పించండి!

కేరాఫ్ సో అండ్ సో

"మీ వాడు డెడ్!"

ఎప్పుడో చిన్నప్పుడు —చదువుకునే రోజుల్లో స్కూలు లైబ్రరీలో చదివిన ఆ కవిత నాకు చాలా ఇష్టం. అప్పుడు నేను దానిని డైరీలో నోట్ చేసుకున్నాను. అయితే నేనొక సైనికుణ్ణవుతానని అప్పట్లో నాకుతెలియదు. అయాక మాత్రం ఆకవిత నా డైరీ లో కాదు.. నా మనస్సులో ఉంటోంది అనుక్షణం పగలూ రాత్రి కూడా. ఆ రాసిన కవి ఎవరో కానీ, మా సైనిక జీవనాన్ని కాచి వడపోసి రాసాడేమో అనుకుంటాను. యుద్ధం వచ్చిన ప్రతిసారీ అదే కవిత నాకళ్ళ ముందు కదులుతుంది —ఈసారి కేబుల్ గ్రామ్...నా పేరుతో వెళ్తుందా అనిపిస్తుంది ఒక్క క్షణం. మృత్యువు ప్రతి మనిషి వెనుకా ఉండే ప్రియమైన శత్రువే అయినా, మాకు మాత్రం ప్రతిరోజూ కళ్ళముందు కనిపించి నవ్వుతూ ఆహ్వానిస్తూ ఉంటుంది. మృత్యువు జ్ఞాపకమొచ్చేసరికి చటుక్కున 'సుమన' స్ఫురణకు వచ్చింది —అవును

ఎంత చిత్రంగా జరిగింది తనతో పరిచయం?

ఆరోజు నేను సెలవు మీద మా ఊరు బయలుదేరాను. రైల్వేస్టేషన్‌లో మా స్నేహితులతో మాట్లాడుతూ నిల్చుని ఉండగా శేఖర్ అన్నాడు "చూడు సీనూ, అక్కడ స్తంభానికి ఆనుకుని నిల్చున్న అమ్మాయి ఎంతబాగుందో" నేను తల తిప్పి చూశాను.

నిజంగానే ఆ అమ్మాయి చాలా బాగుంది ముగ్ధలా.

ఆతరువాత శేఖర్ తన కాబోయే భార్య గురించీ.. ఇంకా ఏవో విషయాలు చెపుతున్నాడు. మిగిలిన వాళ్ళు వింటున్నారు. కాని నేను మాత్రం ఆ అమ్మాయినే చూస్తున్నాను.

ఇంతలో ట్రెయిన్ వచ్చేసింది—

అందరం ఎక్కేశాము ఎవరి కంపార్ట్ మెంట్లలో వాళ్ళము

చిత్రంగా ఆ అమ్మాయి నేను కూర్చున్న చోటికే వచ్చింది!

మా ఇద్దరివీ పక్క పక్క సీట్లు!

చాలా దూర ప్రయాణం కావడంతో మా ఇద్దరి మధ్య పరిచయం మొదట్లో పొడి పొడి మాటలూ సాగినా సమయం గడిచే కొలదీ చాలా దగ్గరి స్నేహితుల్లా అయిపోయాము.

ఆ అమ్మాయి, మా ఊరే వస్తోంది—

అక్కడ టీచర్‌గా ఉద్యోగం వచ్చిందామెకు.

ఇంట్లో ఇద్దరన్నగార్ల మధ్య ఒక్కతే ఆడపిల్ల అయినా తల్లిదండ్రులు లేని కారణాన తన పొట్ట తానే పోసుకోవలసిన పరిస్థితిలో ఉద్యోగంలో చేరుతోంది దాదాపు నా పరిస్థితి కూడా అంతే.


ఇంట్లో నా తరువాత ఇద్దరాడపిల్లలూ , ముగ్గురు మగ పిల్లలూ ఉండటంతో పెద్దకొడుకుగా నాకు చదువు ఎక్కువ సాగలేదు. టెన్త్‌క్లాసు పాసవగానే మా స్కూల్లోని ఫిజికల్ డైరెక్టర్ సహాయంతో ఆర్మీలో ఉద్యోగస్థుడినయ్యాను. నాన్న, పల్లెటూళ్ళో పొలం మీద సంపాదించే నాలుగు డబ్బులకూ నా జీతం తోడై ముగ్గురు తమ్ముళ్ళూ పెద్దచదువులు చదివారు.చెల్లెళ్ళ పెళ్ళిళ్ళయ్యాయి. చివరి తమ్ముళ్ళిద్దరూ ప్రేమ వివాహాలు చేసేసుకున్నారు. నా తరువాతి వాడిది అప్పుడు పెళ్ళి ఆపెళ్ళికే నా ప్రయాణం!

తమ్ముడికి పెళ్ళి అని నాన్న ఉత్తరం చూసిన క్షణాన ఎందుకో నా మనసులో ముల్లు గుచ్చుకున్న భావం కలిగింది. చిన్నవాళ్ళిద్దరూ అంటే మా అమ్మా నాన్నల ప్రమేయం లేకుండా చేసుకున్నారు. పెద్దవాణ్ణి, నాచదువు మానుకుని కుటుంబం కోసం నాన్నబాధ్యతను ఆయనతో సమానంగా పంచుకుని అందరినీ పైకి తెచ్చాను. నాకూ దాదాపు ముప్ఫయ్యయిదేళ్ళు వస్తున్నాయి. నేనిలా ఉండగానే, కనీసం నా పెళ్ళి మాటకూడా తలచకుండా తమ్ముడికి ఆయనే స్వయంగా సంబంధం చూసి పెళ్ళి చేస్తున్నా



ఏరా గంగులూ అలా రొప్పుకుంటూ పరిగెత్తుతున్నావ్! ఏంటీ కథా? పళ్ళికిలిస్తూ ప్రశ్నించాడు హెడ్ కానిస్టేబుల్ పుల్లారావు జేబుదొంగ గంగుల్ని.
ఏం లేదండి అయ్యగారు ఓ జేబు కత్తిరిస్తూ కంటబడ్డాను. వెంటబడ్డారు. తమరే రచ్చించాలి పోలీసాయన అంటూ పక్క సందు మలుపు చెట్టు పక్కన దాక్కున్నాడు గంగులు.

జి. రఘుపతిరావు, తెనాలి.



రంటే —కేవలం నేనొక డబ్బు సంపాదించే యంత్రాన్నన్నే ఆయన భావమా? కొంచెం సేపు బాధపడినా తిరిగి నాకునేనే సర్దుకున్నాను — నేను చేస్తున్న ఈ పనికి, నాకు పెళ్ళయి మాత్రం ఉపయోగం ఏమిటి? అని!

అయితే సుమనను చూడగానే ఆ భావం మారిపోయింది నాలో! అప్పటికే ఒకరి పరిస్థితులొకరం చెప్పుకుని ఉండటం, కాస్త దగ్గరి స్నేహం ఏర్పడటంతో సూటిగా ఆమెను నా మనసులోని మాట అడిగేశాను. చాలాసేపు ఏమీ మాట్లాడలేదామె. ఆమె మౌనం నాలోని లోపాన్ని ఎత్తిచూపుతున్నట్లనిపించింది నాకు. నిజమే.

నేనామెకన్నా దాదాపు ఎనిమిది పదేళ్ళు పెద్దవాణ్ణి కావచ్చు!

ఆమె కన్నాచదువులో చాలా తక్కువ వాణ్ణి కావచ్చు!

ఒక సైనికుడిగా, ఆమెకు సుఖసంతోషాలను ఇచ్చే జీవితాన్ని ఇవ్వలేకపోవచ్చు!

నేనిలా ఆలోచనలో ఉండగానే ఆమె చెప్పింది.

"మీరు ఇంటికి వెళ్ళి మీ నాన్నగారిని అడగండి, నేనూ అన్నయ్యలకి ఉత్తరం రాస్తాను... కేవలం పెద్దవాళ్ళుగా వాళ్ళకు విషయం తెలియజేయటం మన కర్తవ్యం కనకనే అదికూడా వాళ్ళ సమాధానమేదయినా మీ ప్రపోజల్‌కి నాకేమీ అభ్యంతరం లేదు"

ఆమె సమాధానం నాకు కొండంత బలమిచ్చింది.

"థాంక్యూ.. థాంక్యూ వెరీమచ్" అనందంగా చెప్పాను. ఇన్నాళ్ళూ నేను ఒంటరివాడిననీ, నా వాళ్ళకు కూడా నేను సంపాదించే డబ్బు మీదే తప్ప నా మీద ప్రేమ లేదనీ... పిచ్చి పిచ్చి ఆలోచనలతో చిరాకుగా తయారైన నా మనస్సుకు నన్ను నన్ను గా ప్రేమిస్తాను అని ఆమె ఇచ్చిన ఆ సమాధానం నిజంగా చాలా బలాన్నిచ్చింది.

రైలు దిగి, ఎవరిదారిన వాళ్ళము వెళ్ళిపోయాము.

తమ్ముడి పెళ్ళికి వచ్చిన ఆమెను నాన్నకూ అమ్మకూ పరిచయం చేసి మా నిర్ణయాన్ని చెప్పాను.ఆశ్చర్యంగా చూశారు ఇద్దరూ నా వంక. వాళ్ళ భావం ఏమో నాకు తెలియదు కానీ వాళ్ళ కన్నుల్లో నాకు నీకు పెళ్ళెందుకు అన్న ప్రశ్న కనిపించింది ఆ ఆశ్చర్యం వెనుక. ఎవరు అంగీకరించినా అంగీకరించకపోయినా మా పెళ్ళి జరుగుతుంది అని కూడా అప్పుడే చెప్పేశాను! సుమన అన్నల నుంచి ఏసమాధానమూ రాలేదసలు.

తమ్ముడి పెళ్ళికని వెళ్ళిన నేను పెద్దల మనసుకు కష్టం కలిగిస్తూ నా పెళ్ళి కూడా చేసేసుకున్నాను అనుకోకుండా.

సరిగ్గాపెళ్ళయిన సాయంత్రమే నాకు టెలిగ్రామ్ వచ్చింది. వెంటనే బయలుదేరి రమ్మని నేనింకా మా వాళ్ళ ఇంట్లోనే ఉండటంతో ఆటెలిగ్రామ్ నేనే తీసుకున్నాను. వెంటనే నా సామాన్లన్నీ తీసుకుని సుమన ఉంటున్న గదికి పరుగున వెళ్ళాను.

నా చేతిలో టెలిగ్రామ్ అందుకుని చదివిన ఆమె... నేను పెళ్ళి ప్రపోజల్ చేసినప్పుడు ఎంత నిబ్బరంగా ఉందో ఇప్పుడూ అచ్చు అలాగే ఉంది. అదే మౌనం. అదే ఆలోచన.

నాకు మాత్రం మళ్ళీ అదే కవిత జ్ఞాపకమొచ్చింది అదే ఆలోచన. ఈసారి కేబుల్ గ్రామ్ నా పేరుతో వస్తుందా ఈసారి ఎందుకో ఆలోచన నాకు చెప్పలేనంత బాధకలిగించింది. నా గురించి నా మరణం గురించి కాదు నా బాధ. సుమన గురించి.. ఆమె జీవితం గురించి అన్నీ తెలిసీ నేనే ఆమెను ఆశపెట్టి వివాహం చేసుకున్నాను కడివెడు కన్నీళ్ళు తప్ప ఏదీ ఇవ్వలేనా? ఇది నా భయం!

అప్రయత్నంగా రెండు చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చేశాను జీవితంలో మొదటిసారిగా!

ఇంతలో నాభుజం మీద ఏదో స్పర్శ.

నేను తలఎత్తిచూసేలోగానే సుమన నన్ను తనగుండెల్లో దాచుకుంది

"ఏమిటిది పసిపిల్లల్లా..." అంటూ

నిజంగా నేను పసిపిల్లవాడినే అయిపోయానా క్షణం!

"దేనికి బాధ?" లాలనగా ప్రశ్నించింది.

నేనేమీ మాట్లాడలేదు

"ఏమవుతుందోనని భయమా?" తనే అడిగింది మళ్ళీ.

'ఇది' అని వర్ణించి చెప్పలేని దిగులేదో నన్ను మాట్లాడనీయటం లేదు.

"నా మీద బెంగా" అడిగింది.

...

"నేను మీకోమాట చెప్పనా? నేను మిమ్మల్ని కావాలని ఎందుకు పెళ్ళి చేసుకున్నానో తెలుసా? నాకు సైనికులంటే చాలా ఇష్టం. చిన్నప్పటినుంచీ మీకు తెలుసా? కేవలం సైనికులకే జీవితంలో ఉత్కృష్టమైన లక్ష్యం... ఉన్నతమైన ఆదర్శం ఉంటాయి మాతృభూమి సేవ అది. మాతృభూమిని ప్రేమించలేనివాడు, ఎవర్నీ ప్రేమించలేడు అని నా నమ్మకం మీరు ఒక సైనికుడు— మాతృదేశాన్ని ప్రేమించిన సైనికుడు — అందుకే మీ ప్రేమ నిజమైనది అని నమ్మి... మిమ్మల్ని పెళ్ళి చేసుకోవటానికి అంగీకరించాను మరి నాప్రేమలోపడి మీ లక్ష్యాన్ని విస్మరిస్తారా? అలా అయితే నాకు మీమీద చాలాకోపం వస్తుంది! నాకుకోపం రావటం మీకు ఇష్టమా?" చిన్న పిల్లల్ని అడిగినట్టు ఆమె అడుగుతుంటే

అంతదాకా ఆమె మాటల్ని నాగస్వరంలా విన్న నేను —ఒక పసిపిల్లవాడిలాగే 'లేదు' అన్నట్లు తల ఊపాను!

"అయితే లేవండి... చక్కగా మంచి అబ్బాయి లాగా బయలుదేరండి... ఎంతకాలమని... గట్టిగా వారం పదిరోజుల్లో వచ్చేయరూ" ఆ మాట నిజంకాదని తనకూ తెలుసు నాకూ తెలుసు! కానీ తను మాత్రం చాలా నెమ్మదిగా పసిపిల్లల్ని బడికి పంపినట్లు బయలుదేరదీసింది!

ఎందుకో నాకు ఇక ఆ కవిత గుర్తు రాలేదు. సుమన మాటలే తప్ప! ఇంతకాలం నేను సైనికునిగా ఉన్నానంటే కేవలం నా స్వార్థం కోసమే... ఒక 'కర్తవ్యం' నిర్వర్తించి నాలుగు డబ్బులు తీసుకుని... నా కుటుంబానికి సహాయపడాలన్న ఆలోచనతోనే తప్ప —నిజంగా ఏ లక్ష్యమూ, ఆదర్శమూ నడపలేదు నన్ను! కానీ ఆమె చెప్పిన మాటలు నాలో స్ఫూర్తిని నింపాయి. నా జీవితానికి లక్ష్యాన్ని... ఆదర్శాన్ని ఇచ్చాయి. ఇక ఆ కవిత గుర్తు రాదు... నిరాశావాదం ఇక నాదరిచేరదు... ఇదే ఆలోచనతో సుమనను తలుచుకుంటూ క్యాంప్‌కు చేరాను —

శేఖర్, శివ ఎదురయ్యారు నాకు —

"ఏమిటి సంగతి?.... మీరెప్పుడు వచ్చారు?" అడిగాను వాళ్ళతో కలిసి నడుస్తూ —"కాశ్మీరీ మిలిటెంట్లు హజరత్ బాల్‌దర్గాలో ప్రవేశించారు —వాళ్ళను మన వాళ్ళు చుట్టుముట్టారు. రాత్రింబగళ్ళూ కాపలా... అవసరమైతే యుద్ధం..." శివ చెప్పాడు —

అవును —

1990 లో అయోధ్యలో బాబరీ కట్టడం వద్ద కరసేవకులు కరసేవ ప్రారంభిస్తామన్నారు. —ఒకవేళ ఆ కట్టడానికి ఏ అపకారమైనా తలపెడతారేమోనని... అవసరమైతే యుద్ధం —

మళ్ళీ —

1992 లో అదే అయోధ్యలో అదే పని కోసం —

అయితే మొదటిసారి మా చేతుల్లోని తుపాకులు ఆటవిక న్యాయాన్ని అనుసరిస్తూ అహింసావాదుల మీద కాల్పులు జరిపాయి —

రెండవసారి శాంతిమంత్రం వల్లించాయి అవే తుపాకులు - యుద్ధ ప్రాతిపదికన, ఒక పార్టీ మీటింగ్‌ను ఆపటానికి, ర్యాలీ ఆపటానికీ మళ్ళీ కాల్పులు జరిపాయి -

ఇప్పుడు —

విదేశీ మిలిటెంట్లు ఆరాధనాస్థలాన్ని రణరంగంగా మారుస్తుంటే —శాంతిమంత్రం జపిస్తారో లేక యుద్ధం చేయమంటారో —

"సౌతాఫ్రికా ప్రధానికి,
సామరస్యమే ప్రధాన లక్ష్యం!
రష్యా ప్రెసిడెంటుకు
ప్రపంచశాంతే గమ్యం —
పాకిస్తాన్ ప్రధానమంత్రికి'
స్నేహభావమే 'స్ఫూర్తి'హారం —
అమెరికన్ ప్రెసిడెంటుకు,
పరోపకారమే పరమధర్మం!
అయినా ఈ యుద్ధాలన్నీ ఎందుకో తెలుసా సోదరా?
అది... మన ప్రారబ్ధం...!'

శేఖర్ చదువుతున్నాడు. ఏ పుస్తకంలోనో చదివిన కవిత —

నేను నా వివాహం మాట వాళ్ళతో చెప్పాలనుకుంటూండగానే జరిగింది. అత్యంత ఆశ్చర్యకరమైన సంఘటన —

ఎవరో ముసుగు వ్యక్తులు వస్తూనే మమ్మల్ని నోళ్ళు గట్టిగా మూసివేసి, గింజుకునే అవకాశం కూడా ఇవ్వకుండా లాక్కెళ్ళిపోతున్నారు — మా చేతుల్లోని సామాన్లు దారిలో అక్కడక్కడ పడిపోయాయి. —ఏవిధంగా స్పృహ తప్పిందో తెలియలేదు కానీ స్పృహ వచ్చేసరికి —శత్రుదేశపు ఖైదీలుగా బంధింపబడి ఉన్నాము —

నాకంటే ముందుగా స్పృహలో కొచ్చిన శివ అంచనా ప్రకారం మన దేశపు సైనికులు కొన్ని వందల సంఖ్యలో బంధీలై ఉన్నారక్కడ —

జైళ్ళు ఎంత అసహ్యంగా ఉన్నాయంటే —

దుర్గంధం... బొద్దింకలు... దోమలు... గండుచీమలు... చీకటి... పైగా ఖైదీలకు ఆ గదులు 'ఆల్ ఇన్ 'వన్' అని చెప్పారు. మంచినీళ్ళు అడిగితే —అక్కడి మిలిటెంట్లు గ్లాసుల్లోకి మూత్రం చేసి ఇస్తున్నారని వార్త అలాగే మూడురోజులు గడిచిపోయాయి—

అందరూ వాళ్ళలో వాళ్ళు ఏవో మాట్లాడుకుంటున్నారు కానీ నేను మాత్రం సుమన గురించి ఆలోచిస్తూ ఉండిపోయాను. ఈ పాటికి ఈ వార్త తనకి తెలిసి ఉంటుందా ఏవిధంగా ప్రతిస్పందిస్తూ ఉంటుంది? 'అయ్యో నేనే పంపానే' అనుకుంటూ ఉంటుందా? ఏమవుతుందోనని భయపడుతూ ఉంటుందా? నా గురించి బెంగపెట్టుకుంటూ ఉంటుందా? ఎలా ఉందో తను? ఈ ఆలోచనలే సరిపోయాయి నాకు —

రోజులు గడిచిపోతున్నాయి —'ఆల్ ఇన్ 'వన్' గదులలో దుర్గంధం మరింత రాకూడదని....ఎవరికి వారే ఏమీ తినటం తాగటం... ఆఖరికి మంచినీళ్ళను కూడా తాగటం మానివేశారు



ఏమిరా చేతిలో పాలతో ఎక్కడికి వెళుతున్నావు? అడిగాడు స్నేహితుడు.
రాముడి గుళ్ళో ఉత్సవం జరుగుతుంది దానిలో అందరీని పాలు పంచుకోమని చెప్పారు అందుకే... చెప్పాడు రవి.

వై. సత్యశేషశయనం,
అనంతపురం.

ఆ వార్త విని! విపరీతమైన నీరసం... ప్రాణం పోతుందేమోనన్నంత నీరసం!

అంతలోనే "హజరత్ బాల్ దర్గాలోని మిలిటెంట్లని విడిచిపెట్టటానికి మన ప్రభుత్వం అంగీకరిస్తే మనల్నందరినీ విడిచిపెడ్తారట... లేదంటే మనను సజీవంగా సమాధి చేసేసేస్తారట"అన్న వార్త వచ్చింది —

అప్పుడు...ఇన్ని రోజుల తర్వాత మళ్ళీ గుర్తొచ్చింది మళ్ళీ కవిత. మృత్యువుతో పాటు నవ్వుతూ నిల్చుంది నాముందు —" ఈసారి నీపేరుతోనే కేబుల్ గ్రామ్ వెళ్లేది" అన్నట్లు పరిహసిస్తూ!

అందుకే మృత్యువు గుర్తుకు రాగానే సుమన, స్ఫురణకు వచ్చింది! ఈ సారి మృత్యువు పంపే కేబుల్ గ్రామ్ గురించి రాలేదు అలోచన — మృత్యువుతో వెళ్లే ముందు —నా దేశానికి నేను ఏమి చేయగలను? అని! అంతదాకా సుమన గురించి సాగిన ఆలోచనలు, ఇప్పుడు కర్తవ్యం ఏమిటి? అని అలోచనలోపడ్డాయి!

మాకు కాపలా ఉన్నవాళ్ళు పదుల్లో ఉంటారు —

మేము వందల్లో ఉన్నాము —

వాళ్ళను తప్పించుకుని —అందరం ఏకత్రితమై విజయం సాధించలేమా? అప్పుడు దర్గాలోని మిలిటెంట్లను ప్రభుత్వం విడిచిపెట్టనవసరం ఉండదు. ఆ ఆలోచన వచ్చినదే తడవుగా — అందరినీ ఒక చోటకు చేర్చి —రహస్యంగా చర్చించుకున్నాము.

నిద్రాహారాలూ, కనీస సదుపాయాలు కూడా లేకపోవటంతో శరీరాలు కృశించి పోయినా —ఆ ఆలోచన ఉత్తేజాన్ని ఇచ్చింది అందరి మనస్సులకూ —అంతే అవకాశం చిక్కగానే అందరం ఉప్పెనలా విరుచుకుపడ్డాము వాళ్లమీద — మేమా పనిచేస్తామని ఊహించలేదేమో ఒక్కసారిగా జరిగిన తిరుగుబాటుకు వాళ్లు ఆశ్చర్యపోయారు. వాళ్లు తేరుకోక మునుపే చేతికందినన్ని ఆయుధాలు తీసుకుని బోర్డర్‌వైపు పరుగుపెట్టాము మేము.

కాల్పులు —
ప్రతి కాల్పులు —
అరుపులు —కేకలు —
బీభత్సం —
మృత్యువు మందహాసం —

అవును... ఈ సారి మిలిటెంట్లే ఎక్కువమంది మరణించారు —

మమ్మల్ని చూసి మృత్యువు మందహాసం మాత్రమే చేసింది కనకనే —

మరణించిన ఓ పదిమందినీ దారిలోనే విడిచిపెడూ —

బోర్డర్ చేరాము —

అంతదూరాన బోర్డర్ చూడగానే ఆనందం...విజయోత్సాహం —

భారత్‌మాతాకీ జయ్...జయ్ హింద్... అరుచుకుంటూ బోర్డర్ దాటి మనదేశంలో ప్రవేశించేశాము —

విజయోత్సాహంతో క్యాంప్స్‌కు చేరుకోగానే వార్త —

ఇన్ని రోజులూ, రాజమర్యాదలతో దర్గాలోని మిలిటెంట్లను జాగ్రత్తగా చూసిన ప్రభుత్వం... వారికి సెక్యూరిటీ ఏర్పాటు చేసి మరీ పంపింది వాళ్ల దేశానికి అని!

నిరుత్సాహం ఆవరించింది!

మేమక్కడ దుర్గంధంలో —కీటకాల్లా క్రిముల్లా మగ్గుతుంటే —

మిలిటెంట్లకు దర్గాలో గౌరవమర్యాదలు!

మేమక్కడ మిలిటెంట్ల మూత్రాలను దాహంగా తీసుకొంటుంటే మిలిటెంట్లకిక్కడ ప్రజల నుంచి సెక్యూరిటీ ఏర్పాటుతో భోజన సదుపాయాలు!

మేమక్కడ దేశ గౌరవం కోసం ప్రాణాలకు తెగించి పోరాడి విజయం సాధించి వస్తే —

మిలిటెంట్లను సెక్యూరిటీ ఏర్పాటు చేసి పంపటం —

నిజంగా —

మేము, కీ ఇస్తే తిరిగే ఆటబొమ్మ సైనికులమేనా?

మేము సాధించింది విజయమా —పరాజయమా?

మాకు, అసలు శత్రువు ఎవరు?

ఆలోచనతో మా ఊరు చేరుకున్నాను క్యాంపు నుంచి —

వార్త తెలిసినది మొదలూ సెలవుపెట్టి, నిద్రాహారాలు మాని నా కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్న సుమన కళ్లలో —కోటి సూర్యుల కాంతి తళుక్కుమంది నన్ను చూడగానే —రేపటి నా మరో సంగ్రామానికి ప్రోత్సాహం కనిపించింది ఆ కాంతిలో! ●